Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం, జులై 16, 2026

## ఏసీబికి చిక్కిన భూగర్భ జలశాఖ అధికారి



**టి మీడియా, జూలై 15 , సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా భూగర్భ జలశాఖ జిల్లా అధికారి మేగావత్ బాలును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు లంచం తీసుకుంటూ బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ చర్యను నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు చేపట్టారు. ఏసీబీ వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడి బోర్‌వెల్ డ్రిల్లింగ్ రిగ్‌కు అనుమతి మంజూరు చేయడంతో పాటు, అనవసర జరిమానాలు విధించకుండా, రిగ్‌ను స్వాధీనం చేసుకోకుండా ఉండేందుకు జిల్లా భూగర్భ జలశాఖ అధికారి మేగావత్ బాలు రూ.20,000 లంచం డిమాండ్ చేశారు. ఈ లంచాన్ని భూగర్భ జలశాఖ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న డేటా

3లో

# రహదారుల అభివృద్ధికి
# కేంద్రమంత్రికి తుమ్మల లేఖలు

**నాలుగు వరుసలుగా ఖమ్మం-అశ్వారావుపేట**

**-ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కి.మీ లింకుకు మంజూరు**

**- కొత్తగూడెం-పాల్వంచలకు బైపాస్ ప్రతిపాదన**

**టి మీడియా, జూలై 15 , ఖమ్మం :** జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రోడ్డు రవాణా, రహదారులు, ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీకి నాలుగు ప్రత్యేక లేఖలు రాశారు. ఖమ్మం-అశ్వారావుపేట రహదారి నాలుగు వరుసలుగా మార్పు, ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన లింకు మంజూరు, కొత్తగూడెం-పాల్వంచ పట్టణాలకు బైపాస్ నిర్మాణం, భద్రాచలం పట్టణానికి బైపాస్ మంజూరుపై ఈ లేఖల్లో ఆయన వివరించారు.

**భద్రాచలం పట్టణానికి బైపాస్.. కరకట్ట హైవేతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చు...**

ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి-30 ప్రస్తుతం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఉన్న భద్రాచలం పట్టణం



నడిబొడ్డు గుండా వెళ్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాలతో పాటు ఏటా భారీ సంఖ్యలో వచ్చే భక్తుల రద్దీ కలగలిసి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. 10 కిలోమీటర్ల పరిధిలోనే తొమ్మిది ప్రమాద ప్రాంతాలు (బ్లాక్‌స్పాట్లు) ఏర్పడి, ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన పండుగల సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం భారీ వాహనాలను గంటల తరబడి నిలిపివేయాల్సి రావడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యం, సరుకు రవాణాకు ఆలస్యం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఇటీవల భద్రాచలం కరకట్ట మీదుగా ప్రత్యామ్నాయ హైవే నిర్మాణ ప్రతిపాదన తెరపైకి వచ్చినా, దానికి రూ.120 కోట్ల భారీ వ్యయం అవుతుందని మంత్రి గుర్తుచేశారు. అదే భద్రాచలం పట్టణానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు నిర్మిస్తే కేవలం రూ.25 కోట్లతోనే పూర్తి చేయవచ్చని, ఖర్చు తక్కువగా ఉండటమే కాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ బైపాస్‌తో దీర్ఘకాలిక ట్రాఫిక్ రవాణాకు, ముఖ్యంగా భారీ వాణిజ్య వాహనాలకు పట్టణం గుండా వెళ్లే అవసరం తప్పుతుందని, భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుందని, ప్రమాదాలు గణనీయంగా తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని, సరుకు రవాణా మెరుగుపడి ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్-30 వ్యూహాత్మక ప్రాధాన్యతను, భద్రాచలంలో రహదారి భద్రత అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని బైపాస్ నిర్మాణానికి పరిపాలన, ఆర్థిక అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని మంత్రి కోరారు.

**నాలుగు వరుసలుగా ఖమ్మం-అశ్వారావుపేట**

జాతీయ రహదారి 365బీబీలోని ఖమ్మం-అశ్వారావుపేట మార్గాన్ని, జాతీయ రహదారి 563లోని వరంగల్-ఖమ్మం మార్గాన్ని తొలుత నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి గుర్తుచేశారు. అయితే జాతీయ



రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రస్తుత రహదారుల విస్తరణకు బదులు ఖమ్మం-దేవరపల్లి (365బీజీ), వరంగల్-ఖమ్మం (163జీ) పేరుతో కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ రహదారులను చేపట్టిందని తెలిపారు. దీంతో ప్రస్తుత 365బీబీ, 563 రహదారుల విస్తరణ పక్కనపెట్టినట్లు వివరించారు.

ఖమ్మం, వెంకటాయపాలెం, తనికెళ్ల, కొణిజర్ల, పల్లిపాడు, వైరా, పినపాక, తల్లాడ, అంజనాపురం, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, గంగారం, మండలపల్లి, అశ్వారావుపేట తదితర జనావాసాల గుండా సాగే ఈ 122 కిలోమీటర్ల రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతుందని, సుమారు 40 బ్లాక్‌స్పాట్లు

3లో

## మారనున్న ఏజెన్సీ ప్రభుత్వ వైద్య శాలల రూపురేఖలు

**-ప్రతి మండలానికి అంబులెన్స్**

**-వ్యాధులపై ముందస్తు అలెర్ట్**

**టి మీడియా, జూలై 15 , భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం సహా అన్ని ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్య శాలల రూపురేఖలను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త హెల్త్ పాలసీనితీసుకురానుంది. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారికంగా వెల్లడించారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న అన్ని ఏరియా ఆసుపత్రుల్లో దశలవారీగా అధునాతన సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తెస్తామని ఆయన ప్రకటించారు. మారుమూల ప్రాంతాల్లో కేవలం జనాభాను ప్రాతిపదికన తీసుకోకుండా, ప్రజలకు ఎంత త్వరగా వైద్యం అందుతుందనే దూరం ఆధారంగా ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్, కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల మంజూరు ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

**ప్రతి మండలానికి అంబులెన్స్**

ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలను మెరుగుపరిచేందుకు వీలుగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భద్రాద్రి



కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికే 7 డయాలసిస్ సెంటర్లు నడుస్తుండగా, భక్తులు మరియు రోగుల సౌకర్యార్థం మరో 4 కేంద్రాలను అదనంగా మంజూరు చేశారు. రోగులు కేవలం 20 నిమిషాల ప్రయాణంతోనే ఈ సేవలు పొందేలా డయాలసిస్ నెట్‌వర్క్‌ను అనుసంధానించారు. అత్యవసర సమయాల్లో రవాణా ఇబ్బందులు లేకుండా చూసేందుకు కొత్తగూడెం జిల్లాలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్‌ను కేటాయించారు. అలాగే సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులకు అనుబంధంగా వీటి సేవలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

**వ్యాధులపై ముందస్తు అలెర్ట్**

అడవులు, కొండలు, మారుమూల భౌగోళిక పరిస్థితులు గిరిజన ప్రజలకు వైద్యం అందకుండా అడ్డుకాకూడదనే ఉద్దేశంతో గత నెలలోనే ఐటీడీఏ పీవోలతో సమీక్ష నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. వర్షాకాలంలో ఏజెన్సీ ప్రాంతాలను ఎక్కువగా వేధించే మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు అటవీ ప్రాంతాల్లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వీటితో పాటు

3లో



## నాటు బాంబుల తయారీ కలకలం

**టీ.మీడియా,జూలై15 , పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర క్రాకర్స్ దుకాణంలో నాటు బాంబుల తయారీ జరుగుతోందన్న సమాచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. పాల్వంచలో నాటు బాంబుల తయారీ కలకలం..దిశ, పాల్వంచ(టౌన్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర క్రాకర్స్ దుకాణంలో నాటు బాంబుల తయారీ జరుగుతోందన్న సమాచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. హోల్‌సేల్ బాణాసంచా విక్రయాలకు మాత్రమే అనుమతులు ఉన్న దుకాణంలో పేలుడు పదార్థాల తయారీ జరుగుతోందనే ఆరోపణలు రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో బాణాసంచా తయారీకి కఠిన నిబంధనలు అమలులో ఉండగా, కేవలం వ్యాపారానికి మాత్రమే అనుమతి పొందిన దుకాణంలో నాటు బాంబుల తయారీ జరుగుతోందని ప్రచారం జరుగుతోంది. దీనిపై సంబంధిత శాఖలు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధించిన అనుమతులు నిబంధనల ప్రకారమే మంజూరయ్యాయా..? పేలుడు పదార్థాల తయారీకి ప్రత్యేక లైసెన్సులు ఉన్నాయా..? భద్రతా ప్రమాణాలు

3లో

# అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబితాలో స్థానం

**వంద శాతం డిజిటలైజేషన్**

**సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**టీ.మీడియా.జూలై15 , ఖమ్మం:**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు.జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు, 12,43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 8,48,491 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. ఇది 68.22 శాతం పురోగతికి సమానమని, ఇంకా 3,95,290 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు.ఇప్పటికే డిజిటలైజ్ చేసిన వివరాల్లో సుమారు 72 వేల ఓట్లకు సంబంధించిన అనామలీలుగా గుర్తించామని, వాటిని రానున్న రెండు నెలల్లో విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు.సుమారు 25 వేల మంది ఓటర్లు కేవలం ఎన్యూమరేషన్ ఫారాలను మాత్రమే సమర్పించి, అవసరమైన వివరాలు నమోదు చేయకపోవడంతో మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారులు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీచేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో 12 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రస్తుతం అధికారులు 85 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తి చేయగలరని, అయితే 100 శాతం పూర్తి కావాలంటే ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. బీఎల్వోలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వీలైనంత ఎక్కువ మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా అందరూ కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో



మాత్రమే మ్యాపింగ్ కాని ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభమవుతుందని కలెక్టర్ అన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూలి ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా కూడా ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. ఎవరికైనా ఫారం అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్వోను సంప్రదించి ఫారం తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎన్డీసీ సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, అధికారులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, మంకెన రమేష్, కె. వెంకట్ రావు, బిఆర్ఎస్పీ ప్రతినిధి లింగంబోయిన సతీష్ బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఎం పార్టీ ప్రతినిధి సిహెచ్. వెంకటేశ్వర్లు, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రాయల చంద్రశేఖర్ ద్వితీయ వర్ధంతి సభను విజయవంతం చేయండి

**సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పిలుపు**

**టీ మీడియా.జూలై15,సింగరేణి (కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాదారం గ్రామంలో బుధవారం సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో రైతు ఉద్యమ నాయకుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకుడు గుగులోత్ తేజ నాయక్ మాట్లాడుతూ,రైతుల పక్షాన జీవితాంతం పోరాడిన అమరుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతి సభ ఈ నెల 16వ తేదీన ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నట్లు తెలిపారు.ఈ సభను రైతులు,వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.దేశంలో పాలకులు మారుతున్నా రైతుల జీవితాల్లో మార్పు రావడం లేదని,రైతాంగ హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ నాయకుడు రాయల చంద్రశేఖర్ అని కొనియాడారు.చారిత్రాత్మక ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో పాల్గొని మూడు వ్యవసాయ చట్టాల రద్దు వరకు నిరంతరం పోరాటం చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) అనంతరం సీపీఐ(ఎంఎల్) పార్టీ పిలుపునందుకుని పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని,రాష్ట్ర నాయకుడిగా,అనంతరం సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యమాలకు దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమానికి మండల కమిటీ అధ్యక్షుడు పులకాని సత్తిరెడ్డి అధ్యక్షత వహించగా,అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ సభ్యుడు రావుల నాగేశ్వరరావు,మండల నాయకుడు కోయిల శ్రీనివాసరావు,పార్టీ సానుభూతిపరులు పబ్బుల రాము,పోలేపోయిన పెద్ద వెంకన్న,గుంపిడి నరేందర్,బుచ్చి రాములు,ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



## పలు కుటుంబాలను పరామర్శించిన -ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**టి మీడియా, జూలై 15 , దమ్మపేట:** నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన జారే ఆదినారాయణ గారు గండుగులపల్లి గ్రామానికి చెందిన గోరం సురయ్య గారు అనారోగ్యం కారణంగా మృతి చెందగా వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చిన్నగొల్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బడుగు ముత్యాలరావు గారు చుక్కాల రామలక్ష్మి గారిని వారి నివాసాలలో కలిసి పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల బైక్ యాక్సిడెంట్‌కు గురైన వంక లక్ష్మణరావు, రమణ దంపతులను వారి నివాసానికి వెళ్లి పరామర్శించి చికిత్స నిమిత్తం భరోసా కల్పించారు. అనంతరం నల్లకుంట గ్రామంలో వాడే కృప మరియు వంకా అలేఖ్య గారికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అదే గ్రామంలోనిస్కూల్ ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ జరుగుతున్న పాఠశాల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేకిరాల రమేష్ గారు,దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు గారు, గుర్రం మల్లేష్ గారు,ఇంటిక శాంతి కుమార్ గారు,చిన్నశెట్టి గోపి గారు,దైవ ప్రసాద్ గారు,స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో ద్వితీయ స్థానం

**- డివిజన్లో మొదటి స్థానం చింతూరు**

**-తహశీల్దార్ గుబ్బల అర్జున్ రావు.**

**టీ.మీడియా ,జూలై15,చింతూరు:**పోలవరం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సర్ (స్పెషల్ ఇంటెన్షన్ రివిజన్,) కార్య క్రమంలో చింతూరు మండలం విజయాన్ని నమోదు చేసుకుంది. మండల వ్యాప్తంగా చేపట్టిన 100 శాతం ఈఎఫ్ (ఎన్యూ మరేషన్ రేషన్ ఫామ్స్) డిజిటైజేషన్ ప్రక్రియను విజ యవంతంగా పూర్తిచేసి, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, డివిజన్ స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు మండల తహశీల్దార్, మండల ఎన్నికల అధికారి గుబ్బల అర్జున్ రావు( ఏ ఈ ఆర్ వో ) తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటన లో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాల ను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయడానికి మండలంలోని రెవెన్యూ, ఎన్నికల విభాగాల అధికారులు, సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు సమన్వయంతో కృషి చేశారని



పేర్కొన్నారు.

**సిబ్బంది సమిష్టి కృషికే ఈ గౌరవం**

ఈ విజయానికి రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది అందరి కృషి కారణమని తహశీల్దార్ అర్జున్ రావు తెలిపారు. ముఖ్యంగా, శ్రీనివాస్, విగ్నేష్, మల్లు దొర, సునీత సమర్థవంతమైన పర్యవేక్షణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా సాగిందని చెప్పారు. ప్రతి దశలోనూ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం, సమస్యలను వెంటనే పరిష్కరించడం, నిరంతర పర్యవేక్షణ నిర్వహించడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందన్నారు. అన్నారు. ప్రజల సహకారం కూడా కీలకం.ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో మండల ప్రజల సహకారం కూడా ఎంతో కీలకమని అర్జున్ రావు పేర్కొన్నారు.

**అందరికీ ప్రత్యేక అభినందనలు**

జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, డివిజన్లో మొదటి స్థానం సాధించడం మండలానికి గర్వకారణమని తహశీల్దార్ గుబ్బల అర్జున్ రావు పేర్కొన్నారు , ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు, 40 మంది బీఎల్ఎలు, ఎన్నికల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఎన్నికల నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీస్ అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్

**టి మీడియా, జూలై 15 , ఖమ్మం బ్యూరో**

జూలై 7 నుండి 9 వరకు వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్లో జరిగిన భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్-2026లో వృత్తి నైపుణ్యాల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం అభినందించారు. జోనల్ స్థాయిలో కనబరిచిన ప్రతిభనే రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలన్నారు.

**పతకాలు సాధించినవారువీరే...:**

టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వి.ఉదయ్ కుమార్, ఫోరెన్సిక్ సైన్స్, చట్టం ఒ దర్యాప్తు రాత పరీక్షలలో రెండు బంగారు పతకాలు, వేలిముద్రల ప్రాక్టికల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు. కూసుమంచి ఎస్సై వి. దివ్య, వైద్య-న్యాయ పరిశీలన పరీక్షలో రజిత పతకం, ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్షలో కాంస్య పతకం సాధించారు. ఏఆర్ కానిస్టేబుల్ ఎం. మహేష్, యాక్సెస్ కంట్రోల్ పరీక్షలో కాంస్యం పతకం సాధించారు. ఏఆర్ కానిస్టేబుల్ పి.కిరణ్, డాగ్ స్క్వాడ్ పోటీలో కాంస్య పతకం సాధించారు.



## మహిళల భద్రత మనందరి బాధ్యత

**టీ.మీడియా,జూలై15 ,చింతూరు:**మహిళల భద్రత మనందరి బాధ్యత అని చింతూరు ఏ యస్ పి హేమంత్ పేర్కొన్నారు. చింతూరులో బుధవారం మహిళల భద్రతపై విద్యార్థులు, విద్యార్థినులచే ర్యాలీ నిర్వహించారు.మహిళలపై జరుగుతున్న మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని ఎ యస్ పి పేర్కొన్నారు. మహిళల భద్రత గుర్చి అవగాహన సదస్సును చింతూరు గ్రామం లోని వారాంతపు సంతలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

.మొబైల్ వాడకం పెరిగిన ప్రతి మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సి ఐ గోపాలకృష్ణ తో పాటు మహిళా పోలీస్ స్టేషన్ సి ఐ కన్నప రాజు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## గుండెపోటుతోబార్ అసోసియేషన్ అధ్యక్షుడు మృతి

**టీ.మీడియా,జూలై15 , ఇల్లెందు:** బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది రవినాయక్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో గుండెపోటు తీవ్రరూపం దాల్చడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. రవినాయక్ మృతి వార్త తెలిసిన వెంటనే ఇల్లందు న్యాయవాద వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. బార్ అసోసియేషన్ సభ్యులు ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఇటీవల జరిగిన ఇల్లందు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆయన అధ్యక్షుడిగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రవి నాయక్ చిన్ననాటి నుంచే కష్టపడి చదువుకుని న్యాయ విద్యను పూర్తి చేశారు. తన ప్రతిభ, అంకితభావంతో న్యాయవాదిగా మంచి గుర్తింపు తెచ్చుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించారు. జీవితంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటున్న తరుణంలో ఆయన అకాల మరణం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పలువురు సీనియర్ న్యాయవాదులు, సహచరులు ఆవేదన వ్యక్తం చేశారు.

## బీఎల్ఓ కు ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేసిన ఆర్జేసి కృష్ణ.



**టీ.మీడియా,జూలై15 , ఖమ్మం:** నగరంలోని 46వ డివిజన్ బి ఎల్ ఓ కు బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ తన ఎన్యుమరేషన్ ఫారాన్ని బుధ వారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా వారు కూడా వారి ఫారాలను బి ఎల్ ఓ లకు అందజేయాలని కోరారు.

పార్టీ శ్రేణులు కూడా ఓటర్ల యింటికి వెళ్లి ఫారాలు నింపించి బి ఎల్ ఓ లకు అందజేయాలని సూచించారు.ఫారాలు నింపడం రాని వారికి తమ పార్టీ బి ఎల్ ఏ లు అందుబాటులో ఉంటారని ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.ఈ కార్యక్రమం లో పార్టీ 46వ డివిజన్ ఇంచార్జీ కనకం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు .

# తెలుగుదేశం మండల స్థాయి సమావేశం



**టీ.మీడియా,జూలై15,చింతూరు:**చింతూరు మండల పార్టీ క్యాంపు కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ కమిటీల అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, ఉపాధ్యక్షులు, క్లస్టర్, కో-క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బి యల్ ఏ లు, కే యస్ యస్ సభ్యులు, మహిళా కార్యకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇటీవల మండలంలోని అన్ని యూనిట్లలో నిర్వహించిన సమావేశాల ద్వారా గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న ఇబ్బందులు, తాగునీరు, రహదారులు, విద్యుత్, సాగునీరు, గృహాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై యూనిట్ ఇంచార్జులు తమ గ్రామాల తరఫున వినతిపత్రాలను మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ కు సమర్పించారు.

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు, ప్రతి కార్యకర్త సభ్యత్వ కార్డును వినియోగంలో ఉంచాలని, బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

చివరిగా సమావేశాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, వివిధ కమిటీల సభ్యులు, యూనిట్ ఇంచార్జులు, మహిళా కార్యకర్తలు మరియు కార్యకర్తలందరికీ మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## పెండింగ్ వేతనాలు చెల్లించాలిలి. సీఐటీయూ

**టీ.మీడియా,జూలై15 ,చింతూరు:** మండల వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని అలానే ఇతర సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఐ టి డి ఏ ముందు నిరసన చేపట్టారు ఈ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామలక్ష్మి. జిల్లా అధ్యక్షులు పుష్ప జిల్లా గౌరవ అధ్యక్షులు శాంతిరాజు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చెయ్యాలి. మధ్యాహ్నం భోజన కార్మికులకి పెండింగ్ వేతనాలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. రోజువారి మెస్ చార్జీలను ఒక్కొక్కర విద్యార్థికి 20 రూపాయలు ఇవ్వాలి. కనీస వేతనం అమలు చేయాలి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. బ్యాంకుల్లో స్టేట్మెంట్లు ఇవ్వాలి. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలి. అని అన్నారు. అనంతరం తదితర డిమాండ్ తో కూడిన వినతి పత్రానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ నా పరిధిలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కారం చేస్తాను మిగతావి ప్రభుత్వాన్ని దృష్టికి కూడా తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పోడియం లక్ష్మణ్. మండల కమిటీ సభ్యులు చింత రాంబాబు. మధ్యాహ్న భోజన కార్మికులు కుంజా లక్ష్మి. సోడి గంగమ్మ. సున్నం ఇరుమమ్మ. తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధికి

ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజా భద్రత, ప్రాంత అభివృద్ధి దృష్ట్యా ఈ మార్గాన్ని కేంద్ర రహదారుల శాఖకు (మోర్త్) తిరిగి అప్పగించి, నాలుగు వరుసల పనులకు ప్రత్యేక కేసుగా పరిగణించి మంజూరు చేయాలని కోరారు.

**ఖమ్మం ఔటర్ బైపాస్‌లో మిగిలిన 7 కిలోమీటర్ల లింకు..**

గ్రీన్‌ఫీల్డ్ రహదారుల నిర్మాణంతో ఖమ్మం పట్టణానికి పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయ దిశల్లో బైపాస్ ఏర్పడిందని, సూర్యాపేట-ఖమ్మం నాలుగు వరుసల రహదారి, ఖమ్మం-కురవి (365ఏ) పనులతో ఉత్తర భాగం కూడా పూర్తవుతుందని మంత్రి తెలిపారు. దీంతో ప్రతిపాదిత ఖమ్మం ఔటర్ బైపాస్‌లో దాదాపు 80 శాతం సిద్ధమైందని, అయితే ఖమ్మం-కురవి మార్గానికి, వరంగల్-ఖమ్మం (163జీ) మార్గానికి మధ్య ఆగ్నేయ దిశలో 7 కిలోమీటర్ల కీలక అనుసంధాన లింకు మిగిలి ఉందని వివరించారు.

ఖమ్మం-కురవి మార్గాన్ని అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే లింకుతో అనుసంధానిస్తే ఖమ్మం చుట్టూ నిరంతర రింగ్ రోడ్డు పూర్తిస్థాయిలో సాకారమవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ లింకు పూర్తయితే ఖమ్మం చుట్టూ అన్ని జాతీయ రహదారుల మధ్య నిరంతర అనుసంధానం ఏర్పడి, పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలు తగ్గి, రద్దీ, ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. గత రెండు వార్షిక ప్రణాళికల్లో ఈ ప్రతిపాదన చేర్చినా నిధులు మంజూరు కాలేదని గుర్తుచేస్తూ, ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో మిగిలిన లింకుకు ప్రాధాన్యతపై పరిపాలన, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**కొత్తగూడెం, పాల్వంచలకు బైపాస్ అవసరం..**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల మీదుగా సాగే జాతీయ రహదారి 30, ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ పారిశ్రామిక పట్టణాల నడిబొడ్డు గుండా వెళుతుండటంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలు, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి తెలిపారు. ఇసుక లారీలు, పారిశ్రామిక, వ్యవసాయ వాహనాల రాకపోకలతో సుమారు 23 బ్లాక్‌స్పాట్లు ఏర్పడి ప్రాణనష్టం సంభవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరెల్లి -కొత్తగూడెం మధ్య ఎన్‌హెచ్-930 పూర్తయితే ట్రాఫిక్ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కారుకొండ, సూరారం, రామవరం, లక్ష్మీదేవిపల్లి, ఓల్డ్ పాల్వంచ, జగన్నాథపురం మీదుగా 25 కిలోమీటర్ల బైపాస్ నిర్మించి, ఎన్‌హెచ్-930పి, ఎన్‌హెచ్-30లను అనుసంధానించాలని మంత్రి ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుతో రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు, ప్రయాణ సమయం తగ్గి, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని పేర్కొంటూ, ప్రాధాన్యతపై మంజూరు ఇవ్వాలని కోరారు.

## మారనున్న ఏజెన్సీ

## ప్రభుత్వ వైద్య శాలల రూపురేఖలు

పట్వారిగూడెం, అన్నపెరటిపల్లి పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేస్తామని, గండుగులపల్లిలో సరికొత్త హెల్త్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు.

## నాటు బాంబుల తయారీ కలకలం

పాటిస్తున్నారా..? అనే అంశాలపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. అటవీ ప్రాంతానికి ఆనుకొని, జనావాసాల మధ్య ఇలాంటి కార్యకలాపాలు జరిగితే ఎలాంటి ప్రమాదం జరిగినా భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల ఈ వ్యవహారాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి అన్ని సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు.

## ఏసీబికి చిక్కిన భూగర్భ

## జలశాఖ అధికారి

ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్లు ద్వారా స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద నుంచి రూ.20,000 లంచం నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను నిజాయితీగా నిర్వర్తించకుండా అక్రమ లాభం పొందేందుకు ఇద్దరు నిందితులు వ్యవహరించినట్లు ఏసీబీ వెల్లడించింది.నిందితులు మేగావత్ బాలు (జిల్లా భూగర్భ జలశాఖ అధికారి), కోసనోజు వెంకటేశ్వర్లు (డేటా ఎంట్రీ ఆపరేటర్ -- ఔట్‌సోర్సింగ్)లను న్యాయపరమైన రిమాండ్ కోసం నాంపల్లిలోని ఏసీబీ, ఎస్పీఈ కేసుల ప్రత్యేక మొదటి అదనపు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు.